


అనూరాధ వచ్చేసరికి ఇల్లంతా మనుష్యులే లేనట్లు చాలా నిశ్శబ్దంగా ఉండేసరికి ఆశ్చర్య పడింది. రోజూ తను వచ్చేసరికి తల్లీ, తండ్రీ వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండేవారు. అటువంటిది ఈ రోజు అలవాటుకి విరుద్ధంగా తండ్రి ఒంటరిగా పడక్కుర్చీలో కూర్చుని దీర్ఘాలోచనలో శిలవలె ఉండటం, తల్లి గదిలో మంచం మీద ముడుచుకుని పడుకుని ఉండటం చూసి మరింత తెల్లబోయింది.

తండ్రిలో చలనం కలిగించాలని కావాలనే దబ దబ శబ్దం చేస్తూ, అతని ముందు నుంచే బాత్‌రూమ్‌లోకి వెళ్ళి కాళ్ళు, ముఖం కడుక్కొచ్చింది. అప్పుడు భుజంగరావుగారు 'వచ్చేవా, అమ్మా' అన్నట్లు చూసి తిరిగి కళ్ళు మూసుకున్నారు తన ఆలోచన లింకా ఒక కొలిక్కి రానట్టు. తల్లి పిలిచి కాఫీ ఇవ్వక పోయేసరికి తనే వంటగదిలోకి వెళ్ళి ఫ్లాస్కులో పోసి ఉన్న కాఫీని గ్లాసులోకి వంచుకుంది. ఆ కాఫీ కూడా ఇంటి వాతావరణం లాగానే చల్లబడి పోయి ఉన్నందున రెండు గుటకల్లో దాన్ని త్రాగి తిరిగి తండ్రి కూర్చుని ఉన్న దగ్గరి కొచ్చింది.

వంటగదిలో అయిన శబ్దానికి ఉలిక్కిపడి లేచి వచ్చిన శ్రీదేవమ్మ కూతురుని చూసి 'వచ్చా' అన్నట్లు ఒక చూపు విసిరి వరండాలో కొచ్చింది విసురుగా.

## ‘జమ్మెతాంగి’

అమ్మా, నాన్నా ఒకరి కొకరు సంబంధం లేనట్లు ఇంత ముభావంగా ఉన్నా రెందుకని? బంధువుల్లో ఎవరికైనా బాగోలేదా? లేక అన్నయ్య గాని 'మళ్ళీ డబ్బు పంపించ'మని టెలిగ్రామ్ లాంటి ఉత్తరం రాశాడా? ఏదీ ఇదమిత్థంగా తేల్చుకోలేక ఇద్దరి వైపూ చూస్తూ "అన్నయ్య దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందా?" అని అడిగింది నెమ్మదిగా.

"ఆఁ వచ్చింది. నీ పుస్తకాల బల్ల మీద పెట్టాను. చూడు" అంది శ్రీదేవమ్మ.

"ఏమని రాశాడు? అంతా కులాసేనా?"

"ఆఁ అంతా బాగానే ఉన్నారట. తనకు రావ డానికి కుదరదని, పిల్లల చదువులని భార్య వంట్లో అంత బాగాలేదని రాశాడు." ఈ సారి తండ్రి ఇచ్చాడు జవాబు.

'మరి మీ రిద్దరూ అలా ఉండటంలో అర్థం' మనసులోనే అనుకున్న అనూరాధ "అమ్మా! నీ వంట్లో బాగాలేదా" అని అడిగింది దిగులుగా.

'నాకేం రోగం లేదు' అన్నట్లు చిరాగ్గా పెట్టింది శ్రీదేవమ్మ ముఖాన్ని.

'మరి మీరు అలా ఉండటంలో అర్థం?' అనుకుంది. అంతలోనే ఆమె ఆశ్చర్యపడేలా "నా వంట్లో కూడా బాగానే ఉందమ్మా. నువ్వే మీ బాధపడకు" అన్నారు భుజంగరావుగారు.

"నా మనసే పాడైపోయిందమ్మా మీ అమ్మ మాటంతో."

"నా మాటతో పాడయ్యిందా, మీ ఫ్రెండు చేసిన నిర్వాకమా? ఆ మాత్రం తెలివి కూడా ఉందా మీకు?" వ్యంగ్యంగా నవ్వింది దామె.

"నువ్వే చెప్పమ్మా —రాజేశ్వరరావుకి ఏక్సిడెం టయ్యిందిట. తలకి, కళ్ళకు దెబ్బలు తగిలాయంట. వెళ్ళి పరామర్శించి వస్తానంటే 'మీరేం వెళ్ళ నక్కర లేదు—మనం వెళ్ళకపోతే వాళ్ళ సంబంధాన్ని మనలం వదులుకున్నామని వాళ్ళే తెలుసుకుంటారు' అని వాదిస్తున్నది మీ అమ్మ."

"పెళ్ళి మాట దేవు డెరుగు—ముందు వెళ్ళి స్నేహితుడిని ఓదార్చి వస్తానంటే వినదేం.

'మనం అదృష్టవంతులం. మన అమ్మాయి అదృష్టవంతురాలు. పెళ్ళయ్యాక ఈ ప్రమాదం జరిగితే దాని రాతకు అదీ, దాన్ని చూసి మనమూ ఏడవవలసి వచ్చేది. అది తప్పింది. మరి ఆ సంబంధం మాట మరిచిపొండి' అంటున్నది.

ఇదెలా సాధ్యం? తల్లీ ఒక సారి మాటలు జరిగి పోయాక, మాటకి కట్టుబడకపోతే ఎలా? నువ్వే చెప్పు." ఆయన కూతురి వైపు చూశారు.

కాని, అనూరాధ మనసు అక్కడ ఉంటే కదూ, తండ్రికి సలహా ఇవ్వడానికి 'తనకి ఏక్సిడెం టయిందా, ప్రమాదమైన దెబ్బలు తగిలాయేమో? నీళ్ళకేం బాధగా లేదా? ఎలా ... ఇప్పు డెలా?' ఆమె మనసు ఆక్రోశిస్తున్నది బాధగా, మౌనంగా.

'తలకి, కళ్ళకు దెబ్బలు తగిలా యంటే ఆ అబ్బాయి కళ్ళు తప్పకుండా పోయే ఉంటాయి. ఇంక ఆ సంబంధం మీద ఆశ పోలేదన్న మాట మీకు కాని, బంగారం లాంటి నా కూతుర్ని మాత్రం చేస్తే నే నూరుకోను." కటువుగా అంది శ్రీదేవమ్మ.

అలా అంటున్న తల్లి వైపు ఏవగింపుగా చూసింది అనూరాధ అసలు నీలో మానవత్వం అంటూ ఉందా' అనే భావంతో. ఒక్కోసారి ఈ పెద్దవాళ్ళు ఇంత నిర్దాక్షిణ్యంగా, కఠినంగా ఎలా మాట్లాడగలరో?

"ఇప్పుడంటే 'ఈ సంబంధం వద్దు' అని ఇంత నిష్కర్షగా చెప్పే అమ్మ, పెళ్ళయ్యాక దురదృష్ట వశాత్తూ కన్నో, కాలో పోతే ఏం చేయగలదు?" ఈ మొగుడు వద్దు, ఇతనికి కాళ్ళు విరిగిపోయాయి' అని ఆంక్ష పెట్టగలదా? ఇంకా ఆ మూడు ముళ్ళూ పడి, మేం భార్యాభర్తలం అనే ముద్ర పడలేదు కాబట్టి చిరిగిపోయిన పాత గుడ్డను 'అవతల పారేయ్' అన్నంత తేలిగ్గా 'ఈ సంబంధం వదులుకుందాం' అంటున్నది. కాని. ఇందుకు తన మనసు అంగీకరిస్తుందా? పైకి

దేశి పిల్సు REGD.
వాడండి ముఖ్యంగా అలస్యమైన,
క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన,
లేక ఆగిపోయినబహిష్టుకు
నిశ్చింతగాను ఆరోగ్యముగాను ఎట్టిహాని కలిగింపదు
SEALED PACKING: 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs: SEENU & CO. MADRAS-21



మంచి పుస్తకాలు
1. జీవితరహస్యాలు:- దివ్యకామసూత్రాలు. రూ. 5
2. యువతి:- దాంపత్యరహస్యాలు. రూ. 5
3. సంతానము:- గర్భనిరోధ మార్గాలు. రూ. 5
4. చేతిపనులు:- సంపాదన మార్గాలు. రూ. 5
5. అద్భుతహాస్యకథలు:- నవ్వటానికి. రూ. 5
6. రసికస్త్రీయకథలు:- శృంగారహాస్యం. రూ. 5
7. హాస్యస్ఫూర్తి తాలు:- స్వప్నాలడిక్షనరీ. రూ. 5
8. మానసిక శక్తులు:- అన్ని అభివృద్ధి వరాలతో. రూ. 5
9. మంత్రశక్తి:- వివిధ సాధనరహస్యాలు. రూ. 5
10. ఏదుర్వైద్యవిధానాలు:- అన్నిరోగాలకు వివిధ మందులు రూ. 16
11. ఆహారవైద్యము:- ప్రకృతి ఆహారమార్గాలు. రూ. 10
12. మూలికావైద్యము:- అందరికి తెలిసిన మొక్కలతో రూ. 10
13. దైవదర్శిని:- బాధల విముక్తికి దైవరహస్యాలు రూ. 10
14. వ్యవహారదర్శిని:- నిత్యవ్యవహారోపయోగబోధిని. రూ. 10
రూ. 20 ఆపైవిలువ ఆర్డర్లకు వి.పి. పోస్టు ఖర్చులు ఉచితం
అంతకన్నా తక్కువ ఆర్డర్లకు పోస్టేజి రూ. 4 అదనం
దేశసేవా ప్రచురణాలు
5/3 ఆర్.టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4



మీకు బేబి/బాబుకావాలా!



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు. ఉచిత వివరములకు
శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వేస్టేషను వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2.


అనుకోకపోయినా, అతన్ని చూసిన క్షణం నుంచే అతన్ని తన భర్తగా, జన్మ జన్మల బంధంగా భావిస్తూ మనసులోనే ఆరాధించుకుంటున్నదే! అటువంటి వ్యక్తిని ఇప్పుడు ఏమీ కాడని ఎలా అనుకోగలదు? ఊహూ తన వల్ల కాదు. కుంటివాడైనా, బధిరుడైనా మనసా, వాచా అతన్నే తన జీవిత నాయకుడిగా భావిస్తుంది. ఇది నిజం, అలా మనసుని నోదార్చుకుంటున్న దామె.

* * *

భుజంగరావుగారు, రాఘవయ్యగారు చిన్నప్పటి నుంచీ చాల స్నేహంగా ఉండేవారు. ఒకే కంచంలో తిని, ఒకే మంచం మీద పడుకోకపోయినా, ఇరుగు పొరుగు ఇళ్ళు కావడంతో, మాటలు వచ్చీ రాని వయస్సప్పటి నుంచీ కూడా వాళ్ళ మధ్య స్నేహమనే బంధం బలీయంగా నాటుకుంది. మిడిల్ స్కూల్ నుంచి కాలేజీ వరకూ విడిపోకుండా, ఒక్క క్లాసన్నా తప్పకుండా ఒక్కొక్క మెట్టే దాటుకుంటూ డిగ్రీలో అడుగు పెట్టారు. అప్పటి నుంచీ వాళ్ళ స్నేహానికి అవరోధం ఏర్పడసాగింది. రాఘవయ్యది కాస్త కళా హృదయం—అందుకని అడపా దడపా నాటకాల్లో వేషాలు వేస్తూ, సభలు సమావేశాల్లో పాల్గొంటూ, పెద్ద పెద్ద వేదికల మీద ఉపన్యాసాలిస్తూ, గొప్ప గొప్ప వ్యక్తులతో పరిచయాలు చేసుకుంటూ, అదే తన ధ్యేయంగా తిరుగుతూ చదువుని నిర్లక్ష్యం చేయసాగాడు.

భుజంగరావు అలా కాదు. చదువే తన ధ్యేయం. బాగా చదివి క్లాస్ తెచ్చుకుని, చదువుకి తగిన ఉద్యోగం సంపాదించుకుని, బాగా ఆర్జిస్తూ పిల్లా పాపలతో సుఖ సౌఖ్యాలతో జీవితాన్ని గడపా లన్నదే అతని ఆకాంక్ష. అందుకే రాత్రి, పగలు చదువుకే అంకితమైపోయినట్లు అహర్నిశలూ చదువులో లీనమయి ఉండేవాడు. భుజంగరావు కలలు అలా ఉండటానికి కారణం అతని పేదరికమే. తండ్రి చిన్నరకం రైతు. తండ్రి అన్నదమ్ములు అంతా పండని పొలంతో కుస్తీలు పడుతుంటే, తను పుస్తకాలతో కుస్తీ పట్టేవాడు. అందుకు ఆపోజిట్టు రాఘవయ్య జీవితం. అతనిది బాగా కలిగి ఉన్న సంసారం. చదువే అతని జీవితం కాదు. చదువు కేవలం కాలక్షేపం, అమ్మాయిల దృష్టిలో పడటం, అమ్మాయిల అభిమానం సంపాదించడం—ఇదీ అతని చదువులోని అంతర్యం. అతను ఆశించినట్లే అమ్మాయిల్లో అతనంటే చాలా గ్లామరే ఏర్పడింది. రాఘవరావు బాగా పాడగలడు. మంచి నటుడు, మంచి వక్త అనే పేరు బాగా సంపాదించుకున్నాడు. అతని చుట్టూ తిరిగే అమ్మాయిల సంఖ్య కూడా బాగా పెరిగి పోయింది. వాళ్ళతో కబుర్లు చెప్తూ, సినిమాలు, షికార్లు తిరుగుతూ చదువుని నిర్లక్ష్యం చేయసాగాడు. తన ప్రాణ మిత్రుడు చదువుని నిర్లక్ష్యం చేస్తూ నాటకాలు, పాటలు, సినిమాలు షికార్లు, అంటూ అమ్మాయిల అభిమానంకోసం ప్రాకులాడటం భుజంగరావుకి ఏమాత్రమూ ఇష్టం లేదు. చాలాసార్లు మన ధ్యేయం, చదువు దాని తర్వాతే మిగతా వ్యాపకాలు' అంటూ హెచ్చరిస్తూ వచ్చాడు. అయినా మిత్రుడి హిత వచనాలు కర్ణ కఠోర మనిపించిన రాఘవరావు అతనికి దూరంగా ఉండసాగాడు.

ఫైనలియర్ పరీక్షలు వచ్చాయి, వెళ్ళాయి. నిముషమైనా వృథా చేయకుండా చదువుతో గడిపిన భుజంగరావు పరీక్ష పాసు కావడమేగాక, క్లాస్ కూడా తెచ్చుకున్నాడు. అతని తెలివితేటలు చూసి మెచ్చుకున్న ఒక పెద్ద మనిషి తన కూతుర్నిచ్చి పెళ్ళిచేసి, అతన్ని పై చదువులకి పంపించాడు, తన స్వంత ఖర్చులతో.

చదువు నిర్లక్ష్యం చేసిన రాఘవరావు పరీక్ష తప్పేడు. అందుకు అతను బాధపడలేదు. ఒక నాటక సమాజం స్థాపించి, నాటకాలు వేస్తూ, వేయిస్తూ కాలం గడపటం మొదలు పెట్టాడు.

చదువు అబ్బక, వ్యవసాయమూ అబ్బక కొడుకు ఎందుకూ కాకుండా పాడై పోతున్నాడని, పెండ్లిచేస్తే బాధ్యత పెరిగి కుదుర్లోకి వస్తాడేమో అనే ఆశతో కలిగి నింటి పడుచును తెచ్చికొడుక్కి ముడి పెట్టాడు తండ్రి, పెళ్ళి అయి ఒక బిడ్డ తండ్రి అయినా రాఘవరావుకి ఇంటి బాధ్యత ఏమీ పట్ట లేదు, తండ్రికితెలిసికొంత,తెలియకుండా కొంతఅప్పులుచేసి తెచ్చిన డబ్బంతా నాటక సమాజానికే ఖర్చుపెడుతూ పూరంతా అప్పులు చేసి, తండ్రి చివాట్లు వేసేసరికి, ఏదో బాకీ తీర్చే నిమిత్తం పొలం అమ్మి తెచ్చి పెట్టిన డబ్బంతా తీసుకొని ఇంట్లోంచి పరారై పోయాడు. పారిపోయిన కొడుకుని వెతికించి ఇంట్లోకి రప్పించడం కోసం చాలా డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెట్టాడు తండ్రి. మెద్రాసులో ఒక సినిమా పిక్చరు ఇంట్లో ఉండగా చూశామని ఒకరు, కలకత్తాలో కాళీఘాట్‌లో చూశామని ఒకరు, కాశీలో చూశామని కూడా ఒక ఆడ పటాలం ఉందని ఒకరు ఇలా రకరకాల వార్తలు రాఘవరావు గురించి వినిపించేవి కాని అతనుమాత్రం తిరిగి రాలేదు. కొడుకు మీద బెంగతో తల్లి కన్ను మూసింది. కొడుకు చేసిపోయిన అప్పులు, తను చేసిన అప్పులు తీర్చి, ఇంటిని అయ్యవారి పట్టెల్లులా చేశానే అనే దిగులుతో తండ్రి కన్నుమూశాడు. ఆస్తిపోయి, కట్టుకున్నవాడు దూరమై కన్న బిడ్డతో మిగిలింది అతని భార్య. ఆస్తిపోతే పోయింది. భర్తయినా తిరిగి రాకపోతాడా ఏనాటికైనా అనే ఆశతో జీవితం మీద ఆశను పెంచుకుంటూ, కన్న వాడిని కంటికి రెప్పలా కాచుకుంటూ వస్తున్న దామె. రోజులు గడుస్తున్నాయి. నెలలు జరిగిపోతున్నవి. పాత కేలండర్లు చిరిగిపోయిన కొత్త కేలండర్లు వస్తున్నవి, ఎన్నో వసంతాలు గడిచి పోయాయి. పాలు తాగే పసివాడు నూనూగు మీసాల నవ యౌవన ప్రాయంలో అడుగు పెట్టాడు. అప్పుడు వచ్చాడు రాఘవరావు ఆ ఇంటికి. అహఁ కాదు; తీసుకురాబడ్డాడు. మెద్రాసులో ఒక పెద్ద హోటల్లో పనిచేస్తున్న అతన్ని పట్టుకుని బలవంతంగా ఇంటికి లాక్కొచ్చారు, అతని తండ్రి సొమ్ము తిన్న విశ్వాసంతో కొందరు పెద్దలు.

'పోయింది పోగా, ఉన్న భార్యని, బిడ్డని చూసుకో'మని అందరూ నచ్చ చెప్పారు, హితబోధ చేశారు.

అతనితోపాటే నాటక సమాజమూ పోయింది. అదీ తనని బికారిని చేసి మరీ. ఇక ఎక్కడికి పోను. వెళ్ళినా ఇప్పుడు నా దగ్గర ఆస్తి, అందమూ—ఏం ఉంది? ఈ వృద్ధాప్యంలో భార్యా బిడ్డల దగ్గరే పడి ఉంటాను. వాళ్ళు పెట్టిందే తింటాను'

●

నిర్ణయించుకున్న రాఘవయ్యగా మారిన రాఘవరావు ఇంటిపట్టునే బుద్ధిగా ఉండసాగాడు.

'రాడు, ఇక లేడు అనుకున్న భర్త ఇన్నేళ్ళకైనా తిరిగి వచ్చాడు, అదే పదివేలు' అనుకున్న భార్య, 'నాకు మా నాన్న అండ ఉంది అదే పెద్ద ఆస్తి' అనుకున్న కొడుకు అతన్ని ఆదరంగా, అభిమానంగా చూస్తున్నారు. రోజులు క్షణాల్లా గడిచిపోతున్నవి.

తండ్రికి అబ్బని చదువు, సంస్కారం కొడుక్కి అబ్బింది. స్వశక్తితో, స్వయంకృషితో ఉద్యోగం సంపాదించుకుని ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ, ఒక ఆఫీసుకి అధికారి కాగలిగేడు అతను. అతని పేరే రాజేశ్వరరావు. 'నేను ఆఫీసరుని—అందరూ నా చేతి కింద బానిసలు' అనే తేలిక భావం అతనిలో మచ్చుకైనా లేదు. ప్యూను మొదలు సెక్షన్ హెడ్డు వరకూ అందరిని సమానమైన ప్రేమాభిమానాలతో చూస్తుంటాడు. తనలా తన కొడుకు కానందుకు, బాధ్యత కల అధికారి అయినా, ఏమాత్రమూ అతిశయం లేకుండా ఉన్న ఆ కొడుకుని చూసి రాఘవయ్య లోలోపల గర్వంతో మురిసిపోతుంటాడు. ఈ కొడుకు పెళ్ళిచేస్తే తనకింక ఏ కోరికలూ ఉండవని, ఆ క్షణంకోసం ఎదురు చూస్తుండగా అనుకోకుండా బాల్య స్నేహితుడు అయిన భుజంగరావు కలిసేడు ఒక రోజు.

* * *

ఒకానొకనాడు పేదవాడిగా పుడితేనేం, ఇప్పుడు ఆస్తి, అంతస్తూ కూడా సంపాదించుకుని సంఘంలో ఒక ప్రముఖ వ్యక్తిగా మారిపోయాడు. 'ఇదంతా మా మామగారి చలవే' అనుకుంటాడు ఎదిగి వచ్చిన భుజంగరావు. అతను ఉద్యోగం దొరక్క బాధపడుతుంటే, తన పలుకుబడితో ఒక పెద్ద కాంట్రాక్టరు దగ్గర వాటా ఇప్పించాడు. అందులో కాస్త మెలకువలు సంపాదించుకుని తనే స్వయంగా బ్రిడ్జిలు, బిల్డింగులు కాంట్రాక్టుకి తీసుకోవడం మొదలుపెట్టాడు. కాంట్రాక్టులు పెరిగే కొలదీ అతని బ్యాంక్ బేలన్సు కూడా పెరగసాగింది. సూర్యారావుపేటలో రెండంతస్తుల భవనం, ఆ చుట్టుప్రక్కల పళ్ళతోటలు, వెండి, బంగారం, పంటభూమి సమృద్ధిగానే సంపాదించుకున్నాడు. అతనికి ఒక కొడుకు, కూతురూను. కొడుకుని ఇంజనీర్ చేశాడు. చదువుకుంటూనే ప్రేమలో పడి, ప్రేమించిన అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు. 'కొడుకు మంచిపని చేశాడు. నన్ను శ్రమనుంచి తప్పించాడు' అనుకున్నారు ఒక కంటిలో దిగులు కనిపించగా. ఇక కూతురు అనూరాధ డిగ్రీలో చేరి చివరి సంవత్సరం చదువుతున్నది. 'అమ్మాయి కూడా ఎవరినన్నా ప్రేమించాను' అనదు కదా కొంప దీసి' అనే భయం మనసులో తలెత్తుతున్నా, 'ఆడపిల్లలు అంత త్వరగా బైటపడరేమో' అనే సమాధానంతో మనసులోని భయాందోళనల్ని దూరంగా తరుముతున్నాడు. ఏది ఏమైనా, కాలం తెచ్చే మార్పుని మనిషి ముందే వూహించలేడు కదా అనే వేదాంత ధోరణి అతనిది.

ఒక రోజు బజారు వెళ్ళి వస్తుంటే రాఘవయ్య కనిపించాడు. అతన్ని భుజంగరావు గుర్తుపట్టలేదు. అతనే గుర్తుపట్టి పలకరించాడు. 'చూశావా—నా వ్యసనం ఎంత పని చేసిందో' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు, తన కొడుకు చేస్తున్న ఉద్యోగం గురించి చెప్పి 'నీ ఎరికలో ఏదైనా సంబంధం ఉంటే చూడు—మాకు కట్నం కానుకలు అక్కర్లేదు. పిల్ల బాగుండి చదువుకున్నది, బుద్ధిమంతురాలుగా ఉంటే చాలు' అన్నాడు.

'మంచి ఉద్యోగంలో ఉన్న నీ కొడుక్కి సంబంధం దొరకలేదంటే చాల ఆశ్చర్యంగా ఉందే' అని విస్మయాన్ని వ్యక్తం చేశాడు భుజంగరావు.

'నీలాంటి వాడికి ఆశ్చర్యంగానే ఉంటుంది మరి. అని తన కొడుక్కి ఏ కారణంగా ఏ సంబంధమూ కుదరడంలేదో ఆ కారణం గురించి వివరించాడు.

వాళ్ళ వంశంలో ఇంటిని, భార్యా బిడ్డలను వదిలిపెట్టి దేశ ద్రిమ్మరుల్లా తిరిగే ఆనవాయితీ తరతరాల నుంచీ వస్తున్న దనే నెపంతో ఎవరూ తమ పిల్లల్ని ఇవ్వడానికి ముందుకి రావడం లేదట. చూస్తూ చూస్తూ అటువంటి సంబంధం చేయడానికి ఏ ఆడపిల్ల తండ్రి అంగీకరిస్తాడు? అందుకే ముహూర్తం దాకా కూడా వచ్చి చెడిపోతున్నవని వాపోయాడు రాఘవయ్య.

చిన్ననాటి మిత్రుడు పశ్చాత్తాపంతో బాధను వ్యక్తం చేస్తుంటే, భుజంగరావు మనసు కరిగిపోయింది. వాళ్ళ వంశంలో ఒక రిద్దరు ఇల్లు విడిచి వెళ్ళిపోయినంతలోనే తతిమ్మా వారు కూడా అలా వెళ్ళిపోతారనే సిద్ధాంతం ఏమిటి? ఒక వంశంలో తాత ముత్తాత లెవరో దొంగ అని పేరు పడితే, ఇక ఆ వంశంలో అందరూ దొంగలనే చెప్పాలా? ఇదెక్కడి అంధ విశ్వాసమో అని తనూ కాస్సేపు బాధపడ్డాడు. అతనికి ఏ రకంగా అయినా సరే, తన మిత్రుడికి సహాయం చేయాలనే గాఢాభిలాష కలిగింది.

"నీ కొడుక్కి నా కూతుర్నిచ్చి చేస్తానోయ్. అందుకు నీకు, నీ కొడుక్కి అంగీకారం అయితేనే సుమా!" అని చెప్పాడు.

"కూతుర్ని మెచ్చుకో కూడదుగాని, నువ్వే చూస్తావుగా—నీకు వీలైనప్పుడు మీ అబ్బాయిని తీసుకుని మా ఇంటికి రా. లాంఛనప్రాయంగా పెళ్ళి చూపులు ఏర్పాటు చేద్దాము. వాళ్ళిద్దరూ అంగీకరిస్తే చాలు" అన్నాడు మిత్రుడికి మాట ఇస్తూ.

"మా అబ్బాయిని నువ్వయినా చూడవా" అన్నాడు రాఘవయ్య.

"అక్కర్లేదు. నీ అండదండలు లేకుండానే స్వయంకృషితో పైకివచ్చాడంటే, అటువంటి యువకుడిని వేరే చూడటం దేనికి? నీ కుర్రాడు అంద వికారంగా సరే ఈ పెళ్ళి జరిగితీరుతుంది—సరేనా!' ఈ రకంగా, అయినా చిన్ననాటి మిత్రుడి ఋణం తీర్చుకోవాలని భుజంగరావు ఉద్దేశ్యం. చిన్ననాడు తనకెంతో, ఎన్ని రకాలుగానో సహాయం చేసి, తన చదువుకి కారకుడైన ఈ రాఘవయ్యకు ఏ మిచ్చినా ఋణం తీరదు. మనిషి పుడుతూ ఏమీ తీసుకురాడు వెంట; చస్తూ పూచిక పుల్ల కూడా తీసుకుపోడు. అటువంటప్పుడు ఈ భూమి మీద మిగిలిపోయేది, ఆ మనిషి చేసిన మంచి పనులు, దయాగుణ మిదే అతన్ని చిరంజీవిని చేస్తాయి అనే సంగతి అతనికి తెలుసు. తను పోయినా తన మంచి మిగిలిపోవాలని అతని తాపత్రయం. "నీ ఇష్టం, తప్పకుండా మీ ఇంటికి మా వాడిని తీసుకొస్తాను" అన్నాడు ఆనందంతో వీడ్కోలవుతూ.







ఉచితము ఉచితము ఉచితము

తెల్లమచ్చలు

మా ఏకత్ర ప్రారంభించగానే తెల్ల మచ్చల రంగు శీఘ్రంగా మార నారంభిస్తుంది. ఒక సారి రుజువించి చూడండి. ఒక ప్యాకెట్ ఉచితము. ఇంగ్లీషు లేదా హిందీలో వ్రాయుండు

MRITUNJAYA
AUSHDHALAYA (AW)
P.O. Katri Sarai (Gaya)

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

అన్నట్లుగానే ఒక ఆదివారం కొడుకుని తీసుకొని భుజంగరావు ఇంటి అడ్రసు వెతుక్కుంటూవచ్చాడు. అనూరాధ ఇంటిలోనే ఉంది. అదీగాక, నిన్ను చూసు కోవడానికి ఎవరో వస్తున్నారు' అనే సంగతి కూడా ఆ అమ్మాయికి చెప్పలేదు ఎవరూను. ఆ తండ్రీ కొడుకులను మామూలుగా పరిచయం చేశాడు భుజంగరావు—"వీడు నా బాల్య స్నేహితుడు, అతను వీడి వంశోద్ధారకుడు' అంటూ కూతురికి.

'నీ బాల్య స్నేహితుడి గురించి నా కెందుకు చెప్పడం' అని లోలోపల విసుక్కున్నా, అతని కొడుకుని పరిచయం చేస్తున్నప్పుడు సిగ్గుతో తడబడింది అనూరాధ.

అతనితో ముఖ పరిచయం ఎప్పుడో అయింది తనకి అదీ చాల విచిత్రంగా.

తన క్లాస్‌మేటు వకుళ, ఆమె తండ్రికి మరో వూరు (టౌన్) ట్రాన్స్‌ఫరు అయినందున ఆమెకు సెండాఫ్ ఇవ్వడానికి కొంతమంది అమ్మాయిలతో కలిసి స్టేషన్ కెళ్ళింది అనూరాధ. ఆమెను సాగనంపి వస్తుంటే, తన చేతిలోంచి హేండ్ బేగ్ ఎవరో గుంజుకుని పరుగెత్తడం, తను 'దొంగ, దొంగ' అని అరిస్తే భయంతో ఎవరో ఒకయువకుడు పరుగెత్తే కుర్రాడిని అమాంతంగా వాటేసుకుని, వాడి చేతిలోని బ్యాగ్ లాక్కుని తనకి తెచ్చి ఇస్తూ, "అన్నీ ఉన్నాయో లేదో చూసుకోండి" అన్నాడు నవ్వుతూ. మళ్ళీ అతనే అన్నాడు—"రైల్వే స్టేషన్‌లో తిరిగే టప్పుడు పరధ్యాన్నంగా ఉండకుండా చాలా జాగ్రత్త పడాలని మీకు తెలియదా," హేళనతో కూడిన అతని హెచ్చరింపుకి కోపం వచ్చినా, అది క్షణికమే—అతను చెప్పిన దానిలోనూ నిజం ఉంది కదా అని ముఖాన్ని కందగడ్డలా చేసుకుని మరో వైపుకి తిప్పేసుకుంది. ఆ తర్వాత రెండు మూడు సార్లు బస్టాండులోనూ, బజార్లోనూ కనిపించాడతను. అతన్ని చూసి గుర్తించిన కనులు సిగ్గుతో బరువుగా వాలిపోయేవి. గుండెలో చెప్పరాని గుబులు పుట్టేది, అతనెవరు? అతన్ని చూసిన క్షణంలోనే తన మనసుకి వికారం దేనికో అని చాలా సార్లు ఆత్మ విమర్శ చేసుకునేది అనూరాధ. అతని కిదివరకే పెళ్ళయి ఉంటుంది, తనింత పిచ్చిగా అతన్ని ఆరాధించడంలో అసలు అర్థం లేదు. ఒక వేళ పెళ్ళి కాకపోయినా ఎవర్నో ఈ పాటికి ప్రేమించే ఉండవచ్చు. అదే నిజమైతే తన ఈ మూగ ఆరాధన వ్యర్థమే కదా' అనుకుంది. ఒకరొకరు చూసుకోగానే కళ్ళు గుర్తించినట్లుగా నవ్వుకునేవి. అతనితో ఏదో చెప్పాలని, ఎన్నో అడిగి తన సందేహాలను నివృత్తి చేసుకోవాలని తలపోసేది. కాని, అతను ఎదురుపడగానే కళ్ళు వాటంతట అవి వాలిపోయేవి లజ్జాభారంతో.

అతను అందని ఫలమేమో తనకి అని నిరాశా నిస్పృహలకు లోనవుతున్న తరుణంలో ఈ ఆనందం, అతను ఎవరో కాదు. తన తండ్రికి బాల్య మిత్రుడి కొడుకే అనే నిజం తెలిసిన ఆ క్షణంలో అనూరాధ మనసు ఎంతో తేలికై పోయింది. గట్లు ఒరుసుకుని బైటకు దూకే కడలి కెరటంలా పొంగిపోయింది ఆనంద పారవశ్యంతో. లేచి నాట్యం చేయాలనేంత ఉత్సాహం కలిగింది. అతి కష్టంగా ఉద్వేగాన్ని అణచుకుంది.

'నమస్తే' అని చేతులు జోడించింది. తన చదువు, అభిరుచులు అతను వివరంగా అడిగి తెలుసుకున్నాడు. తను అడక్కపోయినా, తన చదువు, హోదా, ఉద్యోగం అన్నీ వివరించి చెప్తుంటే ఉక్కిరి బిక్కిరి అయిపోయింది. కాఫీ, టిఫిన్‌లు తిని వెళ్ళిపోయారు. భోంచేయమంటే 'ఇప్పుడు కాదు, మరో సారి' అని నవ్వి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోయాక, కూతుర్ని దగ్గరకు పిలిచి, ఆమె తల నిమురుతూ, "అబ్బాయి ఎలా ఉన్నాడు? నీకు నచ్చినట్లేనా? వాళ్ళు ఎందుకొచ్చారనుకున్నావు? నిన్ను చూసుకోడానికి నేనే రమ్మన్నాను వాళ్ళని. అబ్బాయి బుద్ధిమంతుడని అతని చదువు, సంస్కారం చెబుతున్నవి. మరి నీ అభిప్రాయం కూడా చెప్తే నాకు తృప్తిగా ఉంటుందమ్మా" అన్నాడు భుజంగరావు.

రోగి పాలే కోరాడు, వైద్యుడూ పాలే ఇచ్చాడు అన్నట్లు తన కోరిక, దైవ నిర్ణయం కూడా ఒకలాగానే ఉన్న నన్న మాట, సంతోషం ముప్పిరి గొనగా నోట మాటే రాలేదు అనూరాధకు. చివరకు అతి కష్టంగా గొంతు పెగుల్చుకుని, "మీ ఇష్టమే నా ఇష్టం, నాన్నా" అంది. "అహా—అలా కాదమ్మా. నీ మనసులో ఉద్దేశ్యాన్ని స్పష్టంచేయి." తండ్రి మళ్ళీ మళ్ళీ రెట్టిస్తూ అడుగుతుంటే, తన ఇష్టం చెప్పక తప్పలేదు—"చేసుకుంటే అతన్నే చేసుకుంటాను" అని.

ఆ మాటకి సంతృప్తిగా నవ్వుకున్నారు భుజంగరావుగారు. పైకి చెప్పకపోయినా మనసులో ఒక భయం ఉంది. రాజేశ్వరరావుకూడా తండ్రిలా ప్రవర్తిస్తే తన కూతురు తన మీద విషూత్కారం చేస్తుందేమోనని. ఆ సందేహం కూతురిచ్చిన జవాబుతో తీరిపోయినట్లయింది. కీడెంచి మేలెంచమన్నట్లు, రేపు భవిష్యత్తులో ఏది జరిగినా తను బాధ్యుడు కానక్కరలేదు.

ఈ సంబంధానికి శ్రీదేవమ్మ కూడా సంతృప్తినే ప్రకటించింది. 'వెనకాల ఆస్తిపాస్తులు లేకపోతేనేం, అబ్బాయి చేసే ఉద్యోగం హోదా గలది, పెద్ద మొత్తమే వస్తుంది జీతంగా. కానీ, కట్నం కోరకుండా ఇంతమంచి సంబంధం కుదరడం మన అమ్మాయి అదృష్టం' అంటూ మురిసిపోయింది.

'మంచి రోజు చూసుకుని పెళ్ళి ముహూర్తం పెట్టించుకొస్తాం' అనుకున్నారు. 'ఆ రోజుకోసం ఎంతో ఆత్రతగా చూస్తుంటే ఇప్పుడీ సంఘటన తమని దూరం చేయడానికే ఇలా జరిగిందా? లేక తన ప్రేమని పరీక్షించడానికి ఆ భగవంతుడే కల్పించిన దుస్సంఘటనా?' చెక్కిట చేయి వేసుకుని దిగులుగా ఆలోచిస్తూ కూర్చుంది అనూరాధ.

ఆమెకు ఉన్నపళంగా వెళ్ళి రాజేశ్వరరావుని చూసి రావాలని ఆత్రతగా ఉంది, గాయాలతో పడి ఉన్న అతని 'భయంలేదు. నేను ఉన్నాను మీ అండగా' అని ఓదార్చాలని ఉంది. కాని, అమ్మ ఏమంటుందో? పెళ్ళికాకుండా నీవు వెళ్ళడం దేనికమ్మా, అని తండ్రి వారిస్తాడేమో? లోకులు ఆక్షేపిస్తారేమో' అనే భయం, సందేహం, మనసు విప్పి వాళ్ళతో చెప్పడానికి సిగ్గూ, బిడియమూ అడ్డు వస్తున్నాయి.

"ఎందుకు భయం? నీ భర్త దగ్గరి కెళ్ళడానికి సిగ్గెందుకు? బాహ్యంగా భార్యాభర్తలు కాకపోయినా, మానసికంగా అతన్నే తన భర్తగా స్వీకరించింది



ఆంధ్రప్రదేశ్‌లో ఏజన్సీలు
ఇవ్వబడుచున్నవి
VIJAYA/Masula

ప్పుడో. మనసా, వాచా స్త్రీ ఎవరినైతే నమ్ముతుందో అతనే తన భర్త, తన దైవం, తన ఆత్మ—సర్వం అతనే. అటువంటప్పుడు నీ కింకా సందేహం దేనికి? భయం దేనికి? నీ భర్తను నీవు చూసిరావడంలో తప్పులేదు. వెళ్ళు, ఇప్పుడే వెళ్ళు ... ఆలస్యం అయితే అతన్ని చూసే యోగం కూడా ఉంటుందో ఉండదో...' మనసు చేసిన హెచ్చరికతో, హితబోధతో మనసుని దృఢం చేసుకొని లేచింది అనూరాధ. నిద్రలో నడుస్తున్న దానిలా, తడబడే అడుగులతో గుమ్మం దగ్గరకు వచ్చింది. 'ఎక్కడికమ్మా' అన్నట్లు చూశాడు తండ్రి.

"ఆయన్ని ఏ హాస్పిటల్లో చర్పించారు నీకు తెలుసా, నాన్నా?" అడిగింది బరువు నిండిన స్వరంతో.

"అబ్బాయిని చూడటానికి వెళ్తున్నావా? పద, నేనూ వస్తున్నాను." ఆయనా లేచి చొక్కా వేసుకొని, బరువుగా ఉన్న పర్సుని లోపలి జేబులో పెట్టుకున్నారు.

"నువ్వెక్కడికే! అవ్వ! లోకులు ఏమనుకుంటారనే జ్ఞానమన్నా లేకుండా తైతక్కలాడుతూ బయలుదేరావా?" లోపలినుంచి విసురుగా వచ్చిన శ్రీదేవమ్మ కూతురి చర్యకు విస్తుపోతూ బుగ్గలు నొక్కుకోసాగింది.

'లోకులెందుకమ్మా ఎవ్వడం? నా భర్త దగ్గరకు వెళ్ళడానికి నాకు సర్వ హక్కులూ ఉన్నాయి. అక్కడేమైనా జరిగితే నీ కూతుర్ని చూడలేవు. ఇదే కడసారి చూపు." అనూరాధ వెనక్కి వచ్చి తల్లి పాదాలకు నమస్కరించి ముందుకి దూసుకుపోయింది.

* * *

వాళ్ళు వెళ్ళేసరికి నర్సింగ్‌హోమ్ నిశ్శబ్దంగా ఉంది. దీపాలు పెట్టేవేళ విజిటర్స్‌ని రానివ్వరట. అందుకని గేటు దగ్గర కాపలా వాడు ఉంగ్రీ కూతుళ్ళను లోపలికి వెళ్ళనివ్వలేదు. అతని చేతిలో పది రూపాయలు పెట్టారు భుజంగరావుగారు. అతను నవ్వుతూ గేటు తీసి వాళ్ళను లోపలికి పంపించాడు.

వర్డు బైటే కనిపించాడు రాఘవయ్య. అతని ముఖంలో ఎట్టి ఆందోళనా కనిపించడం లేదు. ప్రశాంతంగానే ఉంది.

"అమ్మాయిని కూడా తీసుకొచ్చావెందుకు—నీకు బంగా రెక్కువ" అంటూ మందలించి, "నువ్వు వెళ్ళి చూసిరమ్మా — నేనూ, నీదూ తర్వాత వెళ్తాను." అన్నా రాయన బెడ్ నంబర్ చెప్పి.

తడబడే అడుగులతో లోపల అడుగు పెట్టింది అనూరాధ. స్పెషల్ వార్డు గనుక అక్కడ మరెవరూ లేరు. ఒక మంచం ఖాళీగా ఉంది. మరో బెడ్ మీద రాజేశ్వరరావు పడుకుని ఉన్నాడు. అతని తలమీద, కాలిమీద కట్లు ఉన్నాయి.

అడుగుల శబ్దానికి ఉలిక్కిపడుతూ "ఎవరూ?" అన్నాడు. అనూరాధ మాట్లాడకుండా వెళ్ళి అతని తలవైపు నిల్చుంది.

"ఎవరంటే మాట్లాడరేం? సిస్టర్ ..." అతను కళ్ళు తెరవకుండానే చేతిని ముందుకి చాపాడు. అతను చేతితో తడువుతుంటే తనని తాను సంబాళించుకోలేక, 'నేను ... అనూరాధను" అంది పెదవులు కంపిస్తుండగా.

"అనూరాధా? ఈ పేరు ఎక్కడో విన్నట్టు జ్ఞాపకం." అతను నుదురు తడువుకోసాగాడు.

'అతను నటిస్తున్నాడా లేక నిజంగానే జ్ఞాపకం లేదా?' అతని ధోరణి చూస్తున్న అనూరాధకు కోపం, రోషం, దుఃఖం పొంగు కొస్తున్నవి. తను ఎన్ని వూహించుకొంటూ వచ్చింది ... తనని చూస్తూనే ఎంతో ఆనందాన్ని ప్రకటిస్తాడని, నీ రాక నాకు చాలా సంతోషాన్ని కలిగిస్తున్నది అని అంటాడని ఎదురుచూసిన తనకి చాలా ఆశాభంగమయింది. 'నీ పేరు ఎక్కడో విన్నట్లు జ్ఞాపకం నాకు—కాని నీ రూపం నా హృదయమంతా నిండి ఉందని మీ కెలా తెలుస్తుంది' అనుకుంది బాధగా.

"మాట్లాడరేం? ఎందుకు వచ్చారు? నేను ఏ దశలో ఉన్నానో చూడటానికి వచ్చారా? క్షమించండి. నా మాటలు మిమ్మల్ని బాధించాలని నా ఉద్దేశం కాదు. మీరు ఎక్కడ ఉన్నారో కూడా చూడగల భాగ్యం నాకు లేదు. అన్ని అంగాల్లోనూ నయనం ప్రధానం అని చెప్తారు. అటువంటి కళ్ళనే పోగొట్టుకున్నాను. ఇక నన్ను చూసి లాభం ఏమిటి మీకు? ప్లీజ్. వెళ్ళి పొండి." అతని మాటలు ఈటెలా తాకుతున్నవి అనూరాధ హృదయాన్ని.

"ఊహూఁ వెళ్ళను. వెళ్ళడానికి రాలేదు ఇక్కడకు'. దృఢంగా ఉంది ఆమె స్వరం.

"వెళ్ళక... అతని గొంతులో వెటకారం. "ఈ గుడ్డివాడితో మీకేం పని? చదువుకున్నావు. అందమైనదానివి. నీకు వరుళ్ళకేం లోటు? కో అంటే కోటి మంది వచ్చి మీ గుమ్మంముందు క్యూలో నిలబడతారు."

ఆ కోటి మందిలో మీరు ఉండరుగా—కనుక నేను ఇక్కడే ఉంటాను. నేను నా సర్వస్వంగా భావించింది మిమ్మల్ని ఒక్కరినే గాని, కోటి మందిని కాదు, మీకు కళ్ళు పోయినా, కాళ్ళుపోయినా, మీరేనా జీవనసర్వస్వం, ఒకవేళ మీ మనసులో మరెవరి మూర్తినో ప్రతిష్ఠించుకుంటే ఆ మాట నిర్భయంగా చెప్పండి. వెళ్ళిపోతాను. మరెప్పుడూ మీ కంట బడను. దుఃఖాన్ని అదిమిపెట్టి రోదన స్వరంతో అతి కష్టంగా అనగలిగింది అనూరాధ.

"నువ్వు ఏమంటున్నదీ నాకు వినిపించడం లేదు. ఇలా దగ్గరగా వచ్చి చెప్పు, రాధా" అన్నాడతను. ఒక ప్రక్కకి అతి కష్టంగా వత్తిగిల్లుతూ. అనూరాధ దగ్గరగా—వంగింది మనసులో మాట చెప్పడానికి. కాని అతనే చేయి చాపి ఆమె భుజం పట్టి దగ్గరగా లాక్కుంటూ ఇప్పుడు చెప్పు, అన్నాడు మందహాస వదనంతో.

"ఊహూఁ, చెప్పను" కోపంతో బుంగమూతి పెట్టిందామె.

"అయితే నేనే చెప్తున్నాను విను. నాకు కళ్ళకు దెబ్బ తగిలిందని తెలిస్తే నీ ప్రవర్తన ఎలా ఉంటుందో తెలుసుకోవాలని చిన్న పరీక్ష పెట్టాను ఆ పరీక్షలో నీవే నెగ్గావు నూటికి నూరు మార్కులు నీవే.." అతను మధురంగా నవ్వేడు.

"మీకళ్ళు..." అతని కళ్ళమీద చేయివేసి ఆశ్చర్యంగా తడిమింది అనూరాధ.

"నిజంగా ఏదెబ్బా తగిల్లేదు. నుదుటిదగ్గర కొద్దిగా చిట్లిన ప్రమాదం జరిగిందంతే, మోకాలి దగ్గర చర్మం కొట్టుకు పోయింది." అంత వరకు కళ్ళ మీదుగా ఉన్న కట్టుని తీసి ఆమెవైపు చూసి కొంటెగా నవ్వేశాడు.

"అబ్బ! హడలుగొట్టేశారు నిజంగా." మనసులోని బెంగ, భయం, పారిపోగా అతనితోపాటు హాయిగా నవ్వేసింది అనూరాధ.

చేయి చేయీ కలుపుకుని లోపలికి రాబోతున్న వియ్యంకుళ్ళిద్దరూ కూడా సంగతి, సందర్భం తెలియకపోయినా నాళ్ళూ నవ్వేశారు గలగలా ✱



"కవ్వింపు"

—ఫోటో : బడగల రమ ప్రసార్థ (వరంగల్)